సాక్షి వరంగల్

శనివారం । 24 । జూన్ । 2023



మంచానికే పరిమితం

తాటిచెట్టు పైనుంచి పడి అంగవైకల్యంతో పోరాడుతున్న గీతకార్మికుడు.. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు.

- 10లో▸



మార్కెట్ ఆదాయానికి గండి

వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆదాయానికి గండిపడుతోంది.

- 10లో▸

గరిష్టం/కనిష్టం $28^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం పొడిగా ఉంటుంది. సాయంత్రం వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

గుండ్లపహాడ్‌లో ఉత్తరాలు స్వాధీనం



సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : గుండ్లపహాడ్ బ్రాంచ్ పోస్టాఫీస్‌లో ఉత్తరాలను నిల్వ చేసిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఏడాది కాలంగా బీపీఎం తన కార్యాలయంలోనే ఉత్తరాలను నిల్వ చేస్తున్నారు. ×ఇంత నిర్లక్ష్యమా?₹ శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎంవో అశోక్ గుండ్లపహాడ్ బ్రాంచ్ పోస్టాఫీస్‌ను సందర్శించారు. కార్యాలయంలో 2019 నుంచి నిల్వ చేసిన ఉత్తరాలు, రికార్డులను పరిశీలించారు. ఉత్తరాలను స్వాధీనం చేసుకుని నర్సంపేట కార్యాలయానికి తరలించారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

పర్వతగిరి : ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని మెపా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల రాజు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్‌ను ఎమ్మెల్సీ అక్రమంగా బంధించి, పరుష పదజాలంతో దూషించి ముదిరాజ్‌లందరినీ అవమానించారని పేర్కొన్నారు. తిడితే ముదిరాజ్‌లు ఊరుకోరని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు భాషబోయిన రామకృష్ణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడిన 11 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. నర్సంపేటలోని ఆచార్య కళాశాలలో ఇద్దరు, ఇచ్చోడ వివేకానంద కళాశాలలో నలుగురు, బైంసా సర్వస్వతి కళాశాలలో ఇద్దరు, బెల్లంపల్లి భవిత కళాశాలలో ఒకరు, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మంచిర్యాల వాగ్దేవి కళాశాలలో ఒకరు కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడి డీబార్ అయ్యారని తెలిపారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తనిఖీ



వరంగల్ అర్బన్: తొలి దశ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తనిఖీ నిర్వహిస్తున్నట్లు వరంగల్ తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా తెలిపారు. శుక్రవారం వరంగల్ ఏనుముల వ్యవసాయ మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను తనిఖీ చేశారు. తనిఖీల్లో వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కోడలిని రక్షించబోయి కరెంట్ షాక్‌తో అత్త మృతి

గీసుకొండ : కోడలిని రక్షించబోయి విద్యుదాఘాతంతో అత్త మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గరీబ్‌నగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గరీబ్‌నగర్‌లో బైరోజు లక్ష్మి (55), ఆమె కుమారుడు, కోడలు ఇంద్రజ నివాసం ఉంటున్నారు. కోడలు ప్రతిరోజు ప్రైవేట్‌గా పనిచేస్తూ రాత్రికి ఇంటికి వస్తుంది. యథావిధిగా ఇంద్రజ రాత్రి ఇంటికి వచ్చి స్నానం చేసి తీగపై బట్టలను ఆరవేయగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన అత్త ఆమెను రక్షించడానికి ప్రయత్నించింది. దీంతో లక్ష్మి విద్యుదాఘాతానికి గురైంది. ఇంతలో అక్కడికి వచ్చిన లక్ష్మి కుమారుడు కర్రతో తీగను తొలగించి, వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి మృతి చెందగా ఆమె కోడలు చికిత్స పొందుతోంది.

కలిసిరాని కాలం

జిల్లాలో ఇప్పటివరకూ కురవని భారీ వర్షాలు

- చిరుజల్లులతో నెమ్మదించిన సాగు
- తేమలేక మొలకెత్తని పత్తి విత్తనాలు
- ఆలస్యమవుతున్న వర్షాకాలం
- ఈనెలలో సాధారణ వర్షపాతం 154 మిల్లీమీటర్లు.. నమోదైంది 92 మి.మీ
- ముందుకు సాగని ముందస్తు ప్రణాళికలు
- ఆందోళన చెందుతున్న రైతులు



నర్సంపేటలో దుక్కిని సిద్ధం చేస్తున్న రైతు

నర్సంపేట/కరీమాబాద్ : వరుణుడు దోబూచులాడుతున్నాడు. సీజన్ ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవడం లేదు. రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నా పంటలు వేయడానికి మాత్రం అనుకూలించడం లేదు. దుక్కులు సిద్ధం చేసుకొని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే భూముల్లో అచ్చు తోలుకుని విత్తిన పత్తి విత్తనాలు తేమ లేకపోవడంతో మొలకెత్తడం లేదు. దీంతో మరోసారి ఆర్థిక భారం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎండాకాలంలో ఎగేసుకుని వచ్చిన వానలు.. తీరా వర్షాకాలం వచ్చే సరికి ముఖం చాటేస్తున్నాయి. నిదుర మబ్బు వీడనట్లుగా నైరుతి రుతుపవనాలు నత్తనడకన కదులుతున్నాయి. కార్తెలు దాటిపోతున్నా పుడమి తల్లికి తొలకరి పులకరింత కలగానే మిగిలిపోతోంది. గురు, శుక్రవారాల్లో చిరు జల్లులు మాత్రమే కురిశాయి. నారుమడుల కోసం సిద్ధం చేసిన దుక్కులు వర్షాల కోసం దిక్కులు చూస్తున్నాయి. విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన చెలకలు చినుకు జాడలేక చిన్నబోతున్నాయి. ఖరీఫ్ సాగు కోసం సన్నద్ధమైన కర్షకులు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. కాలం వెనుకైతే పంటలు చివరికి చేతికందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

ఆరుద్ర వచ్చినా జాడలేని వానలు..

వానాకాలం ప్రారంభమై ఇప్పటికే 15 రోజులు గడిచిపోయాయి. రోహిణి, మృగశిర కార్తెల కాలం ముగిసి ఆరుద్ర రానే వచ్చింది. వాస్తవానికి రోహిణి కార్తె చివరి సమయంలో లేదా మృగశిర కార్తె ప్రారంభంలోనే తొలకరి వానలతో పుడమితల్లి పులకరిస్తుంది. కానీ, ఈసారి ఆరుద్ర కార్తె వచ్చినా కూడా ఇంకా వర్షాల జాడ లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సాధారణంగా ఈ జూన్‌లో వరంగల్ జిల్లాలో సాధారణ వర్షపాతం 154 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు కేవలం 92 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే అన్ని రకాలుగా సాగుకు సిద్ధమైన రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలం మరింత ఆలస్యమైతే చివరకు పంటలు చేతికొచ్చే సమయంలో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం పంటల దిగుబడిపై పడుతుందేమోనని జిల్లా రైతులు ఆవేదన పడుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం ఈసారి సాగు ప్రణాళికలను ముందుకు జరిపినప్పటికీ వర్షాలకు ఇంకా ఒకటి రెండు రోజులు పడుతుందని వాతావరణ శాఖ చెబుతుండడంతో అయోమయం మాత్రం వీడడం లేదు. వర్షాలు మరింత ఆలస్యమైతే ఎలాంటి పంటలు వేసుకోవాలో అనే సందిగ్ధం రైతుల్లో నెలకొంది. మళ్లీ ఇప్పుడు తక్కువ పంట కాలం ఉన్న విత్తనాలు వేయాలంటే అదనపు ఆర్థిక భారం పడుతుందని మదనపడుతున్నారు. ఈ గడ్డుకాలం నుంచి గట్టెక్కించాలని రైతులు వరుణ దేవుడిని వేడుకుంటున్నారు.

పత్తి గింజలు విత్తి రైతుల ఎదురుచూపులు..

జిల్లాలో రెండు రోజులుగా మబ్బులు రైతులను ఊరిస్తున్నాయి. పత్తి గింజలు పెట్టి ఎదురు చూస్తున్న వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నాలుగు చినుకులు పడి నిలిచిపోతుండడం వారిని కలవరపెడుతోంది. వేలాది రూపాయలు వెచ్చించి పత్తి గింజల ప్యాకెట్లు కొనుగోలు చేసి విత్తి దాదాపు 20 రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు వరుణుడు కరుణించడం లేదు. రోహిణి, మృగశిర కార్తెలు ముగిసి గురువారం ఆరుద్ర కార్తె ప్రవేశించిన నేపథ్యంలో అదను దాటిపోతుందనే భయం వారిని వెంటాడుతోంది. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు తొలకరి పలకరించలేదు. గతంలో జూన్ రెండో వారంలో పత్తి విత్తనాలు విత్తడం పూర్తయితే నెలాఖరు వరకు పోగుంటలు (గింజలు మొలకెత్తని చోట) పెట్టేదని రైతులు చెబుతున్నారు. అయితే, గురువారం, శుక్రవారం సాయంత్రం వేళల వరంగల్ నగరంతోపాటు నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. అవసరం లేనప్పుడు కురిసిన అకాల వర్షాలు.. అవసరమైనప్పుడు పడకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎప్పటిలాగే రైతులు చాలా వరకు దుక్కుల్లో అచ్చు తోలి పత్తిగింజలు విత్తారు. వర్షాలు కురవకపోవడంతో గింజలు పాడవకుండా ఉంటాయా అనేది రైతులను తొలుస్తున్న ప్రశ్న. చిరుజల్లులు పడితే భూమి తడిసి లోపల ఉన్న గింజలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. గింజకు సరిపడా తేమ ఉంటేనే మొలకెత్తే అవకాశముంది. కేవలం జల్లులు కురుస్తుండడంతో వాటి పైపొర వరకే తేమ తగిలి పత్తి గింజలు పాడవుతాయని రైతులు చెబుతున్నారు. ఒక మోస్తరు వర్షం కురిస్తే పత్తి గింజలు మొలకెత్తుతాయనే ఆశతో ఉన్నారు. ఏదిఏమైనా వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడోనని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

నిలిచిన ఎంఆర్ఐ సేవలు

- ఎంజీఎంలో పేదలకు తప్పని ఆర్థికభారం
- ఆస్పత్రికి చేరుకున్న పరికరం
- ఇన్‌స్టాలేషన్ కోసం మరో రెండు నెలలు



నిరుపయోగంగా మారిన ఎంఆర్ఐ యూనిట్

ఎంజీఎం: ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎంలో ఎంఆర్ఐ సేవలు నిలిచి నెలలు గడుస్తున్నాయి. వందల సంఖ్యలో రోగులకు సేవలందిస్తున్నామని కాగితాలపై లెక్కలు చూపుతున్న పెద్దాస్పత్రి పరిపాలనాధికారులు ఎంఆర్ఐ సేవలు నిలిచి సుమారు 10 నెలలు గడుస్తున్నా.. పట్టించుకోవడం లేదు. వాటిని త్వరితగతిన అందుబాటులోకి తెచ్చే ప్రయత్నమూ చేయట్లేదు. ఈసేవలపై ఎవరైనా రోగులు ప్రశ్నిస్తే 'అసలు ఎంఆర్ఐ సేవలు అవసరమా? నీకు ఏ డాక్టర్ ఎంఆర్ఐ రాశాడు? నీకున్న ఆరోగ్య సమస్యకు సీటీ స్కాన్ సరిపోతుంది. వైద్యం చేయడం. మాకు తెలుసా. మీకు తెలుసా'అంటూ రోగుల బంధుమిత్రులపై ఎదురు దాడికి దిగడం ఇక్కడ సర్వసాధారణమైంది.

ఎంఆర్ఐ సేవలు తప్పనిసరి

స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు.. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తూ 1500 పడకలతో కొనసాగుతున్న ఎంజీఎం ఆస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు తప్పనిసరి అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాల పాలవడంతో పాటు వెన్నెముక శస్త్రచికిత్సలు నిర్వహించుకునే వారికి, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాత రోగులకు ఎంఆర్ఐ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి. ఈసేవలు నిలిచిపోవడం వల్ల పేదలు ప్రైవేట్ డయాగ్నస్టిక్స్ కేంద్రాలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యసేవలు పొందాల్సి వస్తోంది.

ప్రైవేట్‌కు తరులుతున్న రోగులు

ఎంజీఎంలో ఎంఆర్ఐ సేవలు నిలిచిపోవడం.. వైద్యుల లేమితో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలుతున్నారు. పక్షవాత రోగులు ఎంఆర్ఐ నిర్ధారణ పరీక్షల తర్వాతే ఆ రోగి ఆరోగ్యశ్రీకి అర్హుడు అవుతాడా? కాదా అనేది నిర్ధారిస్తారు. ఎంజీఎం ఎంఆర్ఐ సేవలు లేవనే విషయాన్ని తెలుసుకున్న ఆరోగ్య శ్రీ అనుమతి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మరో రెండు నెలలు ఆగాల్సిందే..



ఎంజీఎంకు చేరుకున్న ఎంఆర్ఐ నూతన పరికరాలు

ఎంజీఎం ఆస్పత్రిలో పాత ఎంఆర్ఐ పరికరం పూర్తి స్థాయిలో మరమ్మతులకు నోచుకోకపోవడంతో కొత్త పరికరం అందుబాటులోకి వస్తోందని కొన్ని నెలలుగా చెబుతున్నారు. అయితే ఎంజీఎంకు ఎట్టకేలకు నూతన పరికరం చేరుకుంది. ఈ పరికరం నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిందని, ఇన్‌స్టాలేషన్‌కు రెండు నెలల టైం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

నాలుగు బీసీ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా 4 మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరయ్యాయి. రాష్ట్రంలో 17 కళాశాలు మంజూరు కాగా, అందులో హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కళాశాలలు ఈ విద్యాసంవత్సరం (2023-2024) లో ప్రారంభం కానున్నాయి. దీంతో అడ్మిషన్లు కల్పించనున్నారు. కాగా, ఇప్పటికే జనగామ జిల్లాకు రెండు డిగ్రీ కళాశాలలు ఇచ్చింది. అందులో ఒకటి బాలుర (పాలకుర్తి), మరోటి మహిళా డిగ్రీ కాలేజీ (పెంబర్తి) ఏర్పాటు చేశారు. వీటిలో గతసంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి.

అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు



నర్సంపేట : దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



దుగ్గొండి : అశోక్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించనున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. నర్సంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వెన్నెముక వ్యాధితో బాధపడుతూ నడువలేని స్థితిలో ఉన్న వారికి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ.లక్ష విలువైన బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. దుగ్గొండి మండలం తొగర్రాయికి చెందిన బండి రాజయ్య, నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన సీరెల్లి రాములు, నర్సంపేట పట్టణానికి చెందిన ఎం.రాజ్‌కుమార్, నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామానికి చెందిన కందకట్ల నవీన్‌కు బ్యాటరీ ట్రై సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రై సైకిళ్లకు ఎక్కువ డిమాండ్ ఉందని, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతీ ఒక్కరికి ట్రైసైకిల్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విద్య, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, నల్ల భారతి, అయా మండలాల ప్రజాప్రతినిధులు, గోనె యువరాజు, సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఝాన్సీ, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి చూసిరండి

దుగ్గొండి : మాజీ ఎమ్మెల్యేల్లారా పల్లెలకు వెళ్లి అభివృద్ధి పనులు చూసిరండి అని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మహ్మదాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వంగేటి అశోక్‌కుమార్ వివిధ గ్రామాలకు చెందిన తన అనుచరులతో కలిసి శుక్రవారం పెద్ది సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గిర్నిబావిలోని కనిష్క ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కరోనా సమయంలో తాను సైనికుడిలా పనిచేశానని గుర్తు చేశారు. ఒక్కసారే ఎమ్మెల్యేగా గెలిచి తన మార్కు చూపించానన్నారు. గోదావరి జలాలను పాకాలకు తరలించి రైతుల కాళ్లు కడిగి 70 ఏళ్లనాటి కలను నిజం చేశామని పేర్కొన్నారు. 2014లో సానుభూతితో గెలిచిన వ్యక్తి ఏనాడూ అసెంబ్లీలో నోరు మెదపలేదన్నారు. మళ్లీ ఏ మొహం పెట్టుకుని పోటీ చేస్తారని ప్రశ్నించారు. అప్పుడే తాను ఎమ్మెల్యేగా ఉంటే నర్సంపేటను రాష్ట్రంలోనే నంబర్-1 స్థానంలో ఉంచేవాడినన్నారు. కట్టలు తవ్వుడు.. బిల్లులు ఎత్తుకునుడు తన నైజం కాదని, తనకు తెలిసిందల్లా అభివృద్ధి మాత్రమేనన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, కాట్ల భద్రయ్య, సుకినె రాజేశ్వర్‌రావు, జక్క అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, తొగరు వెంకన్న, నాగేందర్, గోవింద్ రవి, రూపిక శ్రీనివాస్, బైరి పవన్‌కుమార్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథలకిచ్చిన హామీలు అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



దీక్షలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: సీఎం కేసీఆర్ అనాథలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అనాథల హక్కుల పోరాట వేదిక, ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద శుక్రవారం 'అనాథల అరిగోస' దీక్ష నిర్వహించారు. ఈదీక్షకు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల క్రితం ఇదే రోజున యాదాద్రిలో సీఎం కేసీఆర్‌ను అనాథలు కలిశారని, ఈసందర్భంగా అనాథల కోసం యాదాద్రిలో ఇంటిగ్రేటెడ్ కళాశాల ఏర్పాటు చేస్తామని కేసీఆర్ చెప్పారని, కులం, ఆదాయ సర్టిఫికెట్లు అవసరం లేకుండా అనాథలను గుర్తించేందుకు స్మార్ట్ కార్డుల పంపిణీ, వారికి అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారన్నారు. వానలో తడుస్తూ దీక్ష చేస్తున్న అనాథ పిల్లల అరిగోస కేసీఆర్ ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. అనాథలకిచ్చిన హామీలు నెరవేర్చకపోతే దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మంద కుమార్, వేల్పుల సూరన్న, జన్ను దినేశ్, ఏకు శంకర్, గద్దల సుకుమార్, గంగారపు శ్రీనివాస్, అనాథ పిల్లలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సులు రావొద్దు

- బండౌతపురంలో అడ్డుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించాలని విజ్ఞప్తి



ప్రైవేట్ బస్సును అడ్డుకుంటున్న గ్రామస్తులు



శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

వర్ధన్నపేట: ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకున్న సంఘటన శుక్రవారం బండౌతపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 47 మంది విద్యార్థులుండగా.. వీరిలో ఆరుగురికి గురుకుల పాఠశాలల్లో సీట్లు వచ్చాయి. మిగిలిన 41 మందిలో 10 నుంచి 15 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. స్కూల్ హెచ్‌ఎం శేఖర్ విషయాన్ని సర్పంచ్ అరుణసాయి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె గ్రామస్తులతో మాట్లాడి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదివించే విధంగా చూడాలని కోరారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామంలోకి వచ్చిన ప్రైవేట్ స్కూల్ బస్సులను విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకుని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించుకుంటామని చెప్పడంతో బస్సులు వెనుదిరిగిపోయాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో సర్పంచ్ అరుణసాయి మాట్లాడగా పాఠశాలలో అసలు సౌకర్యాలు లేకుండా చదువులు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు.

పాఠశాలలో కరువైన వసతులు..

గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదు గదులు ఉన్న భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ భవనాన్ని వినియోగించడం లేదు. పక్కనే ఒక హాలు, ఒక వరండా ఉన్న భవనంలో విద్యార్థులకు చదువు చెప్పుతున్నారు. హాలు, వరండాను మాత్రమే 1 నుంచి 7వ తరగతి వరకు వినియోగిస్తున్నారు. మొత్తం హెచ్‌ఎంతో కలిపి నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో కేవలం 10 నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరవుతున్నారు.

పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తేనే..

శిథిల భవనాన్ని తొలగించి ఆ స్థలంలో నూతన భవనం నిర్మిస్తేనే పాఠశాలకు విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో వసతులు కల్పించి, విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి



పాఠశాల నూతన భవన నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకెళ్లి, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా. తల్లిదండ్రులు అర్థం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలి.

-అరుణసాయి, సర్పంచ్ బండౌతపురం

ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మొక్క నాటుతున్న శ్రీధర్, నాయకులు

గీసుకొండ : డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ కార్యకర్తలకు సూచించారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ముఖర్జీ బలిదాన్ దివస్ (వర్ధంతి)ను శుక్రవారం నిర్వహించారు. సందర్భంగా నాయకులతో కలిసి ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, గంట రవికుమార్, మొలుగూరి శ్రీనివాస్, గట్టికొప్పుల రాంబాబు, కంది శ్రీకాంత్, ముల్క ప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారి కల్యాణి, డాక్టర్ సుజాత, బండి సుజాత, గోదాసి అశ్విని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా పంచాయతీ అధికారి కల్పన



వర్మికంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ కల్పన

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా పంచాయతీ అధికారి కల్పన సూచించారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేట, రాగంపేట గ్రామాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని డంపింగ్ యార్డులు, పల్లె ప్రగతి పనులు, గ్రామ పంచాయతీల్లో రికార్డులు, యాప్‌లలో కార్యదర్శుల హాజరు నమోదు వివరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా భాగస్వాములు కావాలని సూచించారు. వర్మికంపోస్ట్ తప్పకుండా తయారీ చేయాలని, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని, గ్రామాల్లో అపరిశుభ్రత కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆమె వెంట ఎంపీఓ పసరగొండ రవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి

- ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు
- నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

కాజీపేట అర్బన్: సమాజంలోని సామాన్యుల ఆవశ్యకతకు అనుగుణంగా ఆవిష్కరణలు చేపట్టాలని ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐసీమెక్-ఆర్‌ఈసీ-23 పేరిట మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా ఏఆర్‌సీఐ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ టాటా నర్సింగరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సౌజన్యంతో ఇతర ఇంజనీరింగ్ విభాగాల్లోని సమస్యల పరిష్కారానికి కాన్ఫరెన్స్ వేదికగా నిలవాలని తెలిపారు. ఈసందర్భంగా కాన్ఫరెన్స్ సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, మెకానికల్ హెడ్ సురేశ్‌బాబు, ప్రొఫెసర్లు రాఘవేంద్ర, సతీశ్, ఇస్మాయిల్ సయ్యద్, సంపత్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఆదాయానికి గండి

- పత్తాలేని అగ్రిమెంటు.. పెండింగ్‌లో రూ.40 లక్షల అద్దె
- నిర్ణయంపై అధికారుల అలసత్వం
- చెల్లించేందుకు సిద్ధమంటున్న కవర్‌షెడ్ వ్యాపారులు
- పట్టించుకోని పాలకవర్గం... అధికార యంత్రాంగం



లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్



వ్యాపారులు లేక ఖాళీగా ఉన్న కవర్ షెడ్

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం కోట్లాది రుపాయలు ఖర్చు చేసి నిర్మించినా అధికారుల ఉదాసీనత, వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సుమారు రూ.50 లక్షల వరకు అద్దెల రూపంలో ఆదాయం మార్కెటింగ్ శాఖ కోల్పోయే ప్రమాదముంది. 95 కమీషన్ లైసెన్సుదారులకు మడిగెలు కేటాయించగా చిల్లర వ్యాపారులకు కవర్ షెడ్‌లో 158 ప్లాట్లు కేటాయించారు. కవర్‌షెడ్‌లో ప్లాట్లు కేటాయించిన అధికారులు వాటి నిర్మాణ వ్యయం లెక్కగట్టి ఇంజనీరింగ్ విభాగం అధికారులు రూ.2300ల అద్దె నిర్ణయించారు. మార్కెట్‌లో ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓపెన్‌ప్లాట్లు కేటాయించడంతో కొనుగోలుదారులు లోపలికి రావడం లేదని కవర్ షెడ్‌లోని చిల్లర వ్యాపారులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీనికి తోడు నిర్ణయించిన అద్దెలు ఎక్కువగా ఉన్నాయని తగ్గించాలని అధికారులను కోరడంతో అగ్రిమెంటు ప్రక్రియ నిలిచిపోయింది. కవర్‌షెడ్‌లోని ప్లాట్లకు నెలకు రూ.1500ల చొప్పున చెల్లిస్తామని వ్యాపారులు అధికారులకు తెలిపారు. అయినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో అద్దెలు తగ్గించాలని స్థానిక ఎమ్మెల్యేను వ్యాపారులు కోరడం, ఈ విషయం మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకుపోవడంతో వ్యవహారం మొత్తం పెండింగ్‌లో పడింది. అద్దెలు తగ్గించినా సుమారు రూ.40 లక్షల వరకు మార్కెట్ కమిటీకి ఆదాయం వచ్చేది. నెలలు గడుస్తున్నా...అగ్రిమెంట్లు చేయకపోవడం, అద్దెలు తగ్గించకపోవడంతో అధికారుల చూపుతున్న నిర్లక్ష్యంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అగ్రిమెంట్లు చేస్తే గిరాకీ లేని కారణంగా కొంతమంది వ్యాపారులు ప్లాట్లు వద్దనే అవకాశాలు కూడా ఉన్నాయి. దీంతో ప్లాట్లు రాకుండా ఉండి ఆసక్తిగల వ్యాపారులకు వీటిని కేటాయించే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా మార్కెట్ కమిటీ పాలకవర్గం, మార్కెటింగ్‌శాఖ జెడీఎం, డీడీఎం, డీఎంలు చొరవ చూపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూరగాయల మార్కెట్‌లోని కవర్ షెడ్‌లో 158 చిల్లర వ్యాపారులకు 2022 మార్చి నెలలో కేటాయించారు. నిర్ణయించిన ప్రకారం అద్దె రూ.2,300ల చొప్పున 158 ప్లాట్లకు నెలకు రూ.3,63,400ల చొప్పున అంటే 16 నెలలకు రూ.58,14,400లు ఆదాయం కోల్పోయినట్లే. వ్యాపారులు కోరిన విధంగా రూ.1500ల చొప్పన వసూళ్లు చేస్తే నెలకు రూ.2,37,000ల చొప్పున 16 నెలలకు రూ.37,92,000లు అద్దెల రూపంలో మార్కెట్‌కు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అగ్రిమెంటు చేస్తే అద్దెలు చెల్లిస్తాం...



అధికారులు అగ్రిమెంటు చేసి రూ.1500లకు అద్దెలు తగ్గిస్తే కట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. ఖాళీ ప్రదేశంలో విచ్చలవిడిగా ప్లాట్లను కేటాయించడంతో చిల్లర వ్యాపారుల వల్ల కవర్‌షెడ్‌లోకి ఎవరూ రావడం లేదు. దీనికి తోడు మార్కెట్ చుట్టూ చిల్లరగా కూరగాయలు అమ్ముతున్నా పట్టించుకోవడం లేదు. వీరిని అదుపు చేస్తే కవర్‌షెడ్‌లోకి వినియోగదారులు వస్తే వ్యాపారం జరుగుతుంది.

–కొలనుపాక సురేష్

సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్



తిరుపతి నాయక్

తరిగొప్పుల : వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకోగా అందుకు కారణమైన సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జాటోతు భోజ్యాతండా శివారు రూప్లాతండాకు చెందిన భూక్య అనిత ఈనెల 13న వరకట్న వేధింపులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేపట్టిన విచారణలో మృతురాలి చిన్నమామ భోజ్యాతండా సర్పంచ్ భూక్య తిరుపతి నాయక్ పాత్ర ఉందని తేలడంతో అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. దీంతో తిరుపతినాయక్‌ను జనగామ సబ్‌జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

పోలీసు కస్టడీకి పిటిషన్..!

- రామకృష్ణయ్య హత్య కేసులో రెండో పిటిషన్‌కు పోలీసుల సిద్ధం?

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య కేసులో నిందితులను మరోసారి కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో దీనిపై పోలీసులు పిటిషన్ వేయగా, కస్టడీకి అవకాశం దొరకలేదని తెలిసింది. గిరబోయిన అంజయ్య తదితర నిందితుల కస్టడీ కోసం ఈనెల 26న(సోమవారం) పోలీసులు మరోసారి పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. రామకృష్ణయ్య హత్య కేసుతోపాటు అంజయ్య.. తన బావమరిది సతీమణి సుభద్రను సైతం చంపేసినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. గతంలో జరిగిన పలు మరణాలు సైతం మర్డర్లే కావచ్చనే అనుమానంతో తదుపరి విచారణకు అంజయ్య మిగతా నిందితుల కస్టడీ కోరుతూ పోలీసులు రెండోసారి పిటిషన్ వేస్తారనే సమాచారం ఉంది. ఇదిలా ఉండగా.. రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసులో పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. డీసీపీ పి.సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ కేసుకు సంబంధించి అనుమానితులను రోజువారీగా విచారిస్తున్నారు.

సంబురాలపై విచారణ

బచ్చన్నపేట : పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య అనంతరం నిందితులు సంబురాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతున్నట్టు సమాచారం. మండలంలోని గోపాల్‌నగర్, నక్కవానిగూడెం, పోచన్నపేట గ్రామాలకు చెందిన పలువురిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ నాగబాబును సంప్రదించగా అనుమానితులను విచారిస్తున్నామని చెప్పారు.

మంచానికే పరిమితం

- చెట్టుపై నుంచి కిందపడి అంగవైకల్యంతో పోరాడుతున్న గీతకార్మికుడు
- భార్య మానసిక వికలాంగురాలు
- ఏడాది గడుస్తున్నా అందనిసాయం
- ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు

దీన గాథ

నెల్లికుదురు: ఓ మానసిక వికలాంగురాలైన మహిళను వివాహం చేసుకుని ఒక కూతురుతో సంతోషంగా జీవించాలనుకునే ఓ గీత కార్మికుడి జీవితం విధి ఆడిన వింతనాటకంలో తాటిచెట్టుపై నుంచి పడి నడువిరిగి 39 ఏళ్ళ వయస్సులోనే మంచానికి పరిమితమయ్యాడు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన కోటగిరి సతీష్‌ది పేద కుటుంబం. ఏడాది క్రితం తాటిచెట్టుపై నుంచి పడి నడుం విరిగి నడుం కిందిభాగం నుంచి ఎలాంటి స్పర్శలేకుండా పోయి కాళ్లు సచ్చుబడి పోయి కదలలేని స్థితిలో ఉన్నాడు. ఆస్పత్రి వర్గాలు జీవితకాలం ఇంతే ఎలాంటి చికిత్స చేసినా లాభం ఉండదని చేతులెత్తేశారు. పెద్దాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుందామంటే తింటానికే తిండిలేదు. సతీష్ భార్య రజిత పుట్టుకతోనే మానసిక వికలాంగురాలు. చిన్నపిల్లాడి వలే తన భర్తను, కూతురును కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. కనీసం వీరికి పింఛన్ కూడా ఇప్పటి వరకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, స్వచ్ఛంద సేవాసంస్థలు, గీత కార్మిక సంఘాలను బాధిత కుటుంబం ప్రాధేయపడుతోంది. దివ్యాంగులకు అందాల్సిన ఉపకరణాలు, డబుల్ బెడ్‌రూం, వంటివి ప్రభుత్వం మంజూరు చేసి అందించాలని వేడుకుంటున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబం చేతులెత్తి వేడుకొంటుంది.



ఆర్థికసాయం అందించాలని కోరుతున్న సతీష్, భార్య రజిత

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
97053 02093, ఎస్‌బీఐ ఖాతా నంబర్ 386459 44988, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0005685ని సంప్రదించాలని కోరారు.

కనిపించని 'నాలుగో సింహం'!

- ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ పదోన్నతుల జాబితాలో పేరు
- ఏడాది నుంచి విధులకు హాజరు కావడం లేదన్న ఐజీ..
- ఉమ్మడి జిల్లా పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా భరత్ అబ్సెంట్

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్ పోలీసుశాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఓ పోలీసు అధికారి ఏడాదికి పైగా కనిపించడం లేదు. వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించి చివరికి వరంగల్ డీఐజీకి అటాచ్‌లో ఉన్న సదరు అధికారి ఏమయ్యాడనేది ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్లుగా ఉన్న 1996 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డీఎస్పీ)లుగా పదోన్నతి పొందనున్నారు. సుమారు రెండేళ్ల కిందట 1995 బ్యాచ్‌కు సంబంధించిన పదోన్నతుల జాబితా వెలువడే సమయంలో 1996 బ్యాచ్‌కు చెందిన కొందరు కోర్టుకు వెళ్లడం.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 మందికి బ్రేక్ పడింది. ఇందులో మల్టీజోన్–1 చెందిన వారు 38 మంది ఉన్నారు. ఎట్టకేలకు రెండు నెలల తర్వాత ఆ జాబితా (1995 బ్యాచ్) క్లియర్ కాగా.. ప్రభుత్వం చొరవతో 1996 బ్యాచ్‌కు చెందిన వారికి కూడ డీఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ఇటీవల లైన్ క్లియరైంది. ఇందులో మల్టీజోన్–1లోని 38 జాబితాను కూడా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఈ జాబితాలోని ఒకరు సర్వీసు నుంచి తొలగించబడగా, ఇద్దరు మృతిచెందారు. మిగిలిన 35 మందిలో భరత్‌కుమార్ ఏడాదిగా విధులకు హాజరు కావడం లేదని పదోన్నతుల జాబితాలోని రిమార్క్స్‌లో ఐజీ పేర్కొన్నారు. బి.భద్రయ్యగా ఉన్న ఆయన భరత్‌కుమార్‌గా పేరు మార్చుకున్నారు. రెండేళ్ల కిందటి వరకు ఇంటెలిజెన్స్‌లో పనిచేసిన భరత్.. పదోన్నతుల జాబితా వెల్లడి నాటికి 'ఏడాదికి పైగా విధులకు గైర్హాజర్'గా పేర్కొనడంపై పోలీసుశాఖలో చర్చ జరుగుతోంది. ఎస్‌ఐగా, సీఐగా పని చేసిన సమయంలో కూడా కొన్ని అంశాల్లో వివాదస్పదం అయ్యాడు. రియల్ ఎస్టేట్ రంగంలో కాలుపెట్టిన ఆయన డీఎస్పీ పదోన్నతుల జాబితా వెలువడే సమయానికి ఎక్కడికెళ్లాడు? ఏం చేస్తున్నాడు? అన్నది చర్చగా మారింది. విధులకు హాజరుకాకుండా.. ఉన్నతాధికారులకు కనిపించకుండా పోయిన ఈ 'నాలుగోసింహం' విషయం హాట్‌టాపిక్‌గా మారింది.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- కీలకంగా మారనున్న ఎరువు
- సమగ్ర పోషకాలకు కేరాఫ్

కరీమాబాద్ : పంటల దిగుబడిలో 'పచ్చిరొట్ట' ఎరువు కీలకంగా మారుతోంది. సేంద్రియ వ్యవసాయంలో దీనికి ఎంతో ప్రాధాన్యం లభిస్తోంది. నేలకు కావాల్సిన సమగ్ర పోషకాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. అధిక దిగుబడి సాధించాలనే ఆశతో రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించడంతో నేలల్లో భూసారం దెబ్బతిని పోషక పదార్థాల లోపంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పచ్చిరొట్ట మూలంగా రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పచ్చిరొట్ట పైర్ల వాడకంలో రెండు రకాలు

పచ్చిరొట్ట పైర్ల వాడకంలో రెండు పద్ధతులున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

1. పచ్చిరొట్ట పైర్లను పొలంలో చల్లి అవి పెరిగిన తర్వాత అదే పొలంలో అక్కడికక్కడే భూమిలో కలియదున్ని తర్వాత పంటవేసుకోవడం. పైర్లు కుళ్లడానికి సరిపోయే రోజులు ముందుగా కలియదున్నాలి. అలా కాకుంటే 50 శాతం పూత వచ్చిన తర్వాత పంటను కలియదున్నాలి.
2. చెట్ల ఆకులు బయటి నుంచి సేకరించి పొలంలో వేసి కలియదున్ని అవి కుళ్లిన తర్వాత పంట వేసుకోవాలి.



పచ్చిరొట్టగా సాగుచేస్తున్న జనుము

వేసే సమయం..

రైతులు ఖరీఫ్ పంటల సాగుకు ముందు వేసవి (మే, జూన్)లో తొలకరి వర్షాలు పడిన వెంటనే దుక్కి దున్ని ఎకరాకు 12 నుంచి 15 కిలోల విత్తనం చల్లాలి. జనుము అయితే ఎకరాకు 20 కిలోలు చల్లాలి. దీర్ఘకాలిక పంటలు, పండ్లతోటల్లో వరుసల మధ్య పచ్చిరొట్ట పైరు వేసి పెరిగిన తర్వాత ఆ భూమిలోనే దున్నాలి.

పచ్చిరొట్టతో ప్రయోజనాలు...

- పచ్చిరొట్టలో సేంద్రీయ పదార్థం ఉండడంతో సూక్ష్మజీవులు విస్తారంగా వృద్ధి చెంది భూసారం పెంపొందడానికి ఉపయోగపడుతుంది.
- భూమిని గుల్లబరిచి నీటి నిలువ సామర్థ్యం పెంచి సులభంగా నీరు,గాలి వేర్లకు అందేలా చేస్తుంది.
- పచ్చిరొట్ట పైర్ల సాగుతో సూక్ష్మపోషక పదార్థాల లోపాలు రాకుండా ఉంటాయి.
- పచ్చిరొట్ట పైర్లు భూమిలో కుళ్లేటప్పుడు రసాయనిక ప్రక్రియలు జరిగి భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి.
- చాలా రకాల పచ్చిరొట్ట పైర్లు పప్పుజాతికి చెందినవి కావడంతో గాలిలోని నత్రజని స్థిరీకరిస్తాయి.
- పాల చౌడు, నల్ల చౌడును నివారిస్తాయి.
- భూసార పరిరక్షణకు తోడ్పడుతాయి.

పచ్చిరొట్టతో రైతులకు మేలు..



వర్షాకాలం పంటలు సాగు చేసే ముందు భూముల్లో పచ్చిరొట్ట వేయడంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడడమే కాకుండా భూసారం పెరిగేందుకు తోడ్పడుతుంది. పంటల దిగుబడి కూడా పెరుగుతుంది. వేసవిలో భూములు ఖాళీగా ఉండడంతో పచ్చిరొట్ట వేయడం ద్వారా వచ్చే పంటకు మేలు చేస్తుంది.

-డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

వ్యవసాయ మోటార్లు చోరీ : నలుగురిపై కేసు

వర్ధన్నపేట : వ్యవసాయ మోటార్లను ఎత్తుకెళ్లిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన అడుప రాజు తన రెండు వ్యవసాయ మోటార్లు, ఎద్దు సత్యనారాయణ ఒక వ్యవసాయ మోటారును ఎస్సారెస్పీ కాల్వ వద్ద అమర్చుకుని తమ పంట పొలాలకు నీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 16న రాజు సమీప గ్రామానికి వెళ్లి తిరిగి 21న ఇంటికి వచ్చాడు. శుక్రవారం పంట పొలం వద్దకు వెళ్లి చూడగా తన రెండు మోటార్లు కనిపించలేదు. అదేవిధంగా సమీపంలో ఉన్న ఎద్దు సత్యనారాయణకు చెందిన ఒక వ్యవసాయ పంపుసెట్ కనిపించలేదు. ఆందోళనకు గురైన ఇద్దరు గ్రామంలోని పాత ఇనుప సామాను షాపు (వెంకటేశ్వర ఐరన్ షాపు)లో వెతికారు. మోటార్లు ముక్కలుగా కనిపించాయని గుర్తించారు. పాత ఇనుప సామాను యజమాని ఊర కృష్ణను విచారించగా ఈనెల 21న వర్ధన్నపేటకు చెందిన అంగడి శివ, వెలమకంటి ప్రణయ్, శివకృష్ణ తనకు మోటార్లు విక్రయించారని తెలిపారు. కొనుగోలు చేసిన కృష్ణతో పాటు వర్ధన్నపేటకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. పంపుసెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



వికాస్ (ఫైల్)

చిట్యాల: అప్పుల బాధతట్టుకోలేక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని జడల్‌పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ. శాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జడల్‌పేటకు చెందిన తనుకు వికాస్(35) గ్రామంలోనే కిరాణంషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో తెచ్చిన అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం అతని జేబులో వాంగ్మూలంతో కూడిన కాగితం లభించడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్న వయస్సులోనే అప్పుల బాధతో మృతి చెందడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

వ్యవసాయ భూమిలోకి అక్రమ ప్రవేశం

- సర్పంచ్‌తో సహా నలుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్ : ఒకరి వ్యవసాయ భూమిలోకి ఓ సర్పంచ్‌తో పాటు మరో ముగ్గురు అక్రమంగా ప్రవేశించడంతో పాటు కొట్టి గాయపరిచిన సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేశామని కురవి-2 ఎస్సై మధుబాబు శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్‌తండ (ఎం) గ్రామానికి చెందిన ఇస్లావత్ వెంకన్న ఈనెల 21న సాయంత్రం తన వ్యవసాయ భూమిలో ఉండగా ఇస్లావత్ తండ సర్పంచ్ ఇస్లావత్ నరేష్ ఒక ట్రాక్టర్‌తో అక్కడికి వచ్చాడు. అందులోని ఇసుకను వెంకన్న భూమిలో పోస్తుండగా ఎందుకు ఇసుక పోస్తున్నావని ఆయన అడిగాడు. దీంతో సర్పంచ్ నరేష్ ఇది తన భూమి అని చెప్పి వెంకన్నను అసభ్యపదజాలంతో దూషించాడు. అంతేకాకుండా సర్పంచ్‌తో పాటు వచ్చిన ఇస్లావత్ వెంకన్న, శ్రీను, లచ్చిరాం, ఇస్లావత్ సుమన్‌లు కలిసి వెంకన్న, ఆయన కుమార్తె ఉషా, తండ్రి లాల్యను కొట్టి గాయపరిచారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

టేకుమట్ల(రేగొండ): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని గాంధీనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన లక్కర్సు మల్లేష్ తన భార్యతో కలిసి వన భోజనాలకు వెళ్లగా ఇంటి వెనకాల ఉన్న తలుపులు పగులగొట్టి ఇంట్లోని తులం బంగారంతో పాటు, రూ.35వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని తెలిపారు. శుక్రవారం మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మిత్రుడికి తోడుగా వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
- మరొకరికి తీవ్రగాయాలు

చిల్పూరు : మిత్రుడికి తోడుగా వెళ్లి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్, కానిస్టేబుల్ ఇంద్రాచారిలు అందించిన వివరాల ప్రకారం..మండలంలోని మల్కాపూర్‌కు చెందిన తాడగోని సాయి, కనకం అఖిల్ ఇద్దరు మిత్రులు. సాయికి చెందిన ట్రాక్టర్ భూపాలపల్లిలో ఉండగా గ్రామానికి తీసుకొచ్చేందుకు మిత్రుడు అఖిల్‌ను తోడుగా రమ్మన్నాడు. సరే అనడంతో గురువారం రాత్రి ఇద్దరు కలిసి భూపాలపల్లికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ట్రాక్టర్ తీసుకవస్తూ చిన్నపెండ్యాల గ్రామ సమీపంలో మూత్ర విసర్జన కోసం రోడ్డు కిందకు దించుతుండగా హనుమకొండ నుంచి వెనకాలే వేగంగా వస్తున్న లారీ ట్రాక్టర్ ట్రాలీని కొట్టింది. దీంతో అఖిల్ (22) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా సాయికి తీవ్ర గాయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన అఖిల్ (ఫైల్)

విరోధిని, వహ్నివాసిని క్రమాల్లో పూజలు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అమ్మవారిని విరోధిని, వహ్నివాసినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు నిత్యాహ్నికం, చతుఃస్థానార్చనాది పూజలు చేశారు. అమ్మవారిని ముదురుఎరుపు గులాబీదండతో, లిల్లీపూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. స్నపనమూర్తిని కాళీక్రమంలో విరోధిని అమ్మవారిగా, భోగబేరాన్ని షోడశీక్రమంలో వహ్నివాసినిగా అలంకరించారు. శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ శేషు భారతి పర్యవేక్షించారు.



విరోధిని అమ్మవారుగా స్నపనమూర్తి



వహ్నివాసిని అమ్మవారుగా..

కెమిస్ట్రీ విభాగంలో ప్రాంగణ నియామకాలు

కేయూ క్యాంపస్: కేయూలోని కెమిస్ట్రీ విభాగం, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రముఖ బల్క్‌డ్రగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ న్యూ ల్యాండ్ ప్రాంగణ నియామకాలు నిర్వహించింది. ఇందులో 50 మంది పాల్గొనగా.. 20 మంది రాత పరీక్ష పూర్తి చేశారు. వీరికి చివరి ఇంటర్వ్యూ హైదరాబాద్‌లో ఉంటుందని కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ సవితాజ్యోత్స్న తెలిపారు. ఇందులో ఎంపికైతే రూ.2.35 లక్షల వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఈప్రాంగణ నియామక ప్రక్రియలో న్యూలాండ్ సంస్థ బాధ్యులు శివకుమార్, డాక్టర్ ఆర్నాట్‌రాయ్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ వెంకటయ్య, ప్లేస్‌మెంట్ ప్రతినిధులు వి.రమణబాబు, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్న విద్యార్థులను కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు అభినందించారు.



ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులతో రిజిస్ట్రార్